పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలి

- కలెక్టర్ సంతోష్

మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, ఏప్రిల్ 10 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా చేపట్టే పనులకు సంబంధించిన పూర్తి వివరాలు, రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులపై గద్వాల నియోజకవర్గ అధికారుల కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ఒక రోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. కూలీలకు వంద రోజుల పనికల్పించాలని సూచించారు. ప్రతి పనికి సంబంధించి అన్ని రిజిస్టర్లు, ప్రాథమిక రికార్డులు పూర్తిగా ఉండాలన్నారు. మూడేండ్ల పనుల వివరాలు సంవత్సరాల వారీగా ప్రతి పని పూర్తి చేశారా లేదా పెండింగ్‌లో ఉందా అనే వివరాలు పంచాయతీ కార్యదర్శి దగ్గర ఉండాలన్నారు. ప్రతి పనికి సంబంధించి అంచనాలు సక్రమంగా రూపొందించాలని ఆదేశించారు. చేపట్టే పనులు కేవలం ఉపాధి కల్పించడమే కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలన్నారు. తోటలు, చెరువులు, నీటి నిల్వలు, రోడ్ల పనుల వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కూలీ రేటు రూ.300నుంచి రూ.307లకు పెంచినట్లు తెలిపారు. ఉపాధి హామీ కింద నిర్వహించే ఏడు రిజిస్టర్లు ఖచ్చితంగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు రిజిస్టర్లు పరిశీలిస్తామని చెప్పారు. రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపికలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్యలేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించాలని ఆదేశించారు. జిల్లాలో గట్టు, కేటీదొడ్డి మండలాల్లో బాల్య వివాహాల సమస్యలు ఎక్కువగా వస్తున్నందున ఇలాంటి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇన్‌చార్జి డీపీవో నాగేంద్ర ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలించిన పూణె బృందం

రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ధరూరు, ఏప్రిల్ 10 : నెట్టెంపాడు ఎత్తిపోతల ఫేజ్-2 రిజర్వాయర్‌ను పూణెకు చెందిన ఇంజినీరింగ్ బృందం పరిశీలించినట్లు, ఈఈ రహీముద్దీన్ తెలిపారు. సెంటర్ వాటర్ పవర్ రిసెర్చ్‌కు చెందిన ఐదుగురు సైంటిస్ట్‌ల బృందం పరిశీలించినట్లు తెలిపారు. రిజర్వాయర్‌లో వాటర్ లీకేజీ సమస్యను గుర్తించడానికి, అబ్జర్వేషన్, ప్లానింగ్, సొల్యూషన్ ప్రక్రియపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు నిపుణులు అధ్యయనం చేసి నివేదికలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎంత బడ్జెట్ అవసరం అవుతుంది, మరమ్మతులకు కావాల్సిన ప్లానింగ్ పద్ధతులు ఏమిటి అనేదానిపై పరిశీలన కొనసాగినట్లు తెలిపారు. ప్రస్తుతం శాస్త్రవేతల బృందం పరిశీలించిన అంశాలపై గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారని తెలిపారు. ఎస్టిమేషన్ ఫైల్ ఫైనాన్స్ శాఖ వద్ద పెండింగ్‌లో ఉందని, ఈ కమిటీ బృందం ఇచ్చిన నివేదికతో పనుల ప్రారంభం కావచ్చని, బడ్జెట్ కూడా కేటాయిస్తారని తెలిపారు.

ఈ పరిశీలన బృందంలో సంజీవ్ బరేలి, సునీల్ పిలై, నర్సయ్య, ఇందిర ముజుకుదార్, తనూశ్రీ సమంత, ర్యాలంపాడు జేఈలు, సీఈలు పాల్గొన్నారు.

రామన్‌పాడు అద్భుతం

మదనాపురం, ఏప్రిల్ 10 : నేర రహిత గ్రామంగా రామన్‌పాడు అద్భుతమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శాంతిభద్రతలు, సైబర్ నేరాలపై గురువారం రాత్రి రామన్‌పాడులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో నేర రహిత గ్రామం ఉందో లేదో తెలియదు కానీ, వనపర్తి జిల్లాలో రామన్‌పాడు గ్రామం ఉన్నందుకు గర్వంగా ఉందని, గ్రామస్తులను అభినందించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ మత్తుమందులపై, రోడ్డు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ శివకుమార్, సీఐ నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

అమరచింత, ఏప్రిల్ 10 : వాహన దారులు విధిగా ట్రాఫిక్ నిబంధలను పాటిస్తూ తమ వాహనాలను నడుపుకోవాలని ఆత్మకూర్ ఎస్సై వాహనదారులకు సూచించారు. గురువారం ఆయన పోలీస్ స్టేషన్ ఎదుట వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వద్ద ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు బాధ్యతగా తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో స్థాయి మించి ప్రయాణీకులను ఎక్కించకోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్, రమేశ్, హరి, వేణు ఉన్నారు.

లాటిన్ అమెరికన్ సదస్సుకు వనపర్తి జిల్లా వాసి ఎంపిక

శివకుమార్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10 : ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో నిర్వహిస్తున్న సొసైటీ ఫర్ లాటిన్ అమెరికా సదస్సుకు వనపర్తి జిల్లా వాసి మొలకపల్లి శివకుమార్ ఎంపికయ్యారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి స్పానిష్‌లో శివకుమార్ పరిశోధన కొనసాగిస్తున్నాడు. తను నమ్ముకున్న పరిశోధనల పట్ల నిజాయితీగా, నిస్వార్థంగా ఉంటూ ముందుకు సాగుతున్న శివకుమార్ ప్రతిపాదించిన పత్రాన్ని గుర్తించిన యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ లండన్ బృందం తన పరిశోధన పత్రాన్ని ఏప్రిల్ 10, 11 తేదీల్లో జరుగనున్న లాటిన్ అమెరికన్ సదస్సులో సమర్పించాలని ఆహ్వానం పంపించింది.

పెండ్లి వేడుకల్లో అపశృతి

గద్వాల అర్బన్, ఏప్రిల్ 10 : జిల్లా కేంద్రంలోని గజేలమ్మ వీధిలోని ఓ పెండ్లి వేడుకల్లో అపశృతి చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం అర్ధరాత్రి గజేలమ్మ వీధిలో ఓ పెండ్లి వేడుకలో కొందరు యువకులు మద్యం తాగి డీజే సౌండ్ బాక్స్‌లను తక్కువ సౌండ్‌తో పెట్టారని ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన ఓ యువకుడు తన వద్ద ఉన్న కత్తితో 9మందిపై దాడి చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ మొగిలయ్య అర్ధరాత్రి ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై పోలీసులను వివరణ కొరగా ఈ విషయానికి సంబంధించి ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అర్జెంటుగా కావలెను
★అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
NT-329238

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

రేషన్ దుకాణాల్లో రిజిస్టర్ నిర్వహించాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10 : రేషన్ దుకాణాల్లో తప్పనిసరిగా బియ్యం నిల్వలకు సంబంధించిన రిజిస్టర్ నిర్వహించడమే కాకుండా సన్న బియ్యం తీసుకున్న కార్డుదారులకు రసీదు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బండారునగర్‌లో ఉన్న రేషన్ దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నల్ల చెరువు ట్యాంక్‌బండ్ సందర్శన

నల్ల చెరువు ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. చెరువు పక్కట్టపై ఉన్న వాకింగ్ చాట్‌పై మొక్కలు రెండు మూడు రోజుల్లో నాటాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఓపెన్ జిమ్ మీదుగా వెళ్లిన విద్యుత్ లైన్లను పక్కకు మార్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ఇబ్బంది లేకుండా చుట్టూ పెన్సింగ్‌తో పాటు విద్యుత్ స్తంభాలకు లైట్లు కూడా ఏర్పాటు చేయాలన్నారు.

హాస్టల్ తనిఖీ

జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను కలెక్టర్ ఆదర్శ్ సురభి సందర్శించారు. పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రీ మెట్రిక్ హాస్టళ్లను కూడా తనిఖీ చేసి భవనంలో విద్యార్థుల వసతి పై ఆరా తీశారు. నూతన భవన నిర్మాణాలకు సంబంధించిన పూర్తి నివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ ఈఈకి సూచించారు. అదే విధంగా కేడీఆర్ నగర్‌లో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి మరమ్మతులు చేయడానికి అవకాశం ఉందా అనే విషయంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బసవన్నగడ్డలో ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, కాశీవిశ్వనాథ్, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

దేశీయ టూరిస్ట్‌కు రైల్వే శాఖ ప్యాకేజ్

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10 : దేశ వ్యాప్తంగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించి సాంస్కృతిక వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రైల్వే శాఖ మేనేజర్ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు విధానాన్ని అందిస్తుందని భారతీయ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ గురువారం ప్రకటనలో తెలిపారు. దేశంలోని దర్శనీయ ప్రాంతాలను పర్యాటకులు సందర్శించేందుకు రైల్వే శాఖ అవకాశం కల్పిస్తుందని, మొత్తం 4 ప్యాకేజీలు వెల్లడించిందన్నారు. అందులో మొదటి టూరు హరిద్వార్, రుషికేష్, వైష్ణవి ఆలయాల యాత్ర ఈనెల 23 నుంచి మే 2వ తేదీ వరకు ఒక్కొక్కరికీ టికెట్ ధర రూ.18,510, రెండో ప్యాకేజీలు కాశీ, పూరి, కోనార్క్, ప్రయాగ్‌రాజ్, అయోధ్య యాత్రకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.16,800, మూడో ప్యాకేజీలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం యాత్రకు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు టికెట్ ధర రూ.14,700, నాలుగో ప్యాకేజీలో జ్యోతిర్లింగాల యాత్ర ఉంటుందని జూన్ 4 నుంచి 12వ తేదీ వరకు త్రయంబకేశ్వరి, మహాకాళేశ్వరం, ఓంకారేశ్వరం, భీమశంకర్, ఎల్లోరా, నాగ్‌పూర్ ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.14,700 ప్రకటించిందని తెలిపారు. ఇతర సమాచారం కోసం www.irctctourism.com సందర్శించాలని, వివరాలకు 040-27702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అంతరాయం

వడ్డేపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని రామాపురంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచుతున్నందున సబ్‌స్టేషన్‌లోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీ నవీన్‌కుమార్, ఏఈ చిన్న సుబ్బరాయుడు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు

గోపాల్‌పేట, ఏప్రిల్ 10 : చెరువులో గల్లంతైన వ్యక్తి శవమై తేలిన ఘటన మండలంలోని పొల్కెపహాడ్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన మిద్దె చిన్న రాములు (45) ఈనెల 8వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. బుధవారం ఉదయం గోపాల్‌పేట పెద్ద చెరువు వద్ద అతడి బట్టలు, చెప్పులు కనిపించాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువులోకి దిగి రాత్రి వరకు వెతికారు. ఆచూకీ లభించలేదు. గురువారం అతడు చెరువులో శవమై తేలి కనిపించాడు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు

అయిజ, ఏప్రిల్ 10 : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వీచిన ఈదురు గాలులకు అక్కడక్కడ చెట్లు నేల కొరిగాయి. గురువారం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన చిరు జల్లులు కురిశాయి. ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగి విద్యుత్తు తీగలకు అంతరాయం ఏర్పడి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అయిజ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా సమీపంలో చెట్టు నేల కొరిగి రాక పోకలకు ఇబ్బందులు కలిగింది. దీంతో మున్సిపల్ కమిషనర్ సైదులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న జేసీబీ సహాయంతో చెట్టును తొలగించి రాక పోకలను పునరుద్ధరించారు.

సౌకర్యాలు కల్పించాలి

అమరచింత, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు వైద్య సేవాలు అందించేందుకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు లావణ్య, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మనోహర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై శిశువును కోల్పోయిన బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు.

వరంగల్ సభకు తరలిరావాలి

నిరసన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, ఏప్రిల్ 10: ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పెబ్బేరు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి కోరారు. ఇందుకోసం కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు గానూ గ్రామాలు, వార్డుల్లో పర్యటించిన సందర్భంగా మాట్లాడుతూ ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్రెస్వామి, వెంకటేశ్, రాజశేఖర్, సాయినాథ్ పాల్గొన్నారు.

ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ధరూరు : ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అమరచింతలో నిరసన తెలుపుతున్న నాయకులు

ధరూరు, ఏప్రిల్ 10 : కేంద్ర ప్రభుత్వం ప్రజా మౌలిక అవసరాలపై ధరలు పెంచే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో చమురు ధరలు తగ్గితే, భారత్‌లో మాత్రం మోడీ ధరలు పెంచడం ఏమిటని మండిపడ్డారు. అమాంతంగా గ్యాస్ సిలిండర్ రూ.50 పెంచితే సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ధరల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవదాసు, నర్సింహులు, మోషా, రాముడు, ప్రవీణ్, నర్సింహా, వినయ్, ఆంజనేయులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

అయిజలో..

అయిజ, ఏప్రిల్ 10 : పేద ప్రజల నడ్డివిరుస్తూ కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట స్వామి డిమాండ్ చేశారు. కేంద్ర సర్కారు పెంచిన వంటగ్యాస్ ధరలకు వ్యతిరేకంగా గురువారం అయిజ పట్టణంలోని కొత్త బస్టాండ్ కూడలిలో ఖాళీ సిలిండర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు 2024 నుంచి తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఒకే సారి గ్యాస్‌బండ ధర రూ.50 పెంచుతూ నిర్ణయం తీసుకోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు లక్షల కోట్లు రుణాలు రాయితీలుగా ఇచ్చి ఆ భారాన్ని పేద ప్రజలపై మోపుతున్నదని విమర్శించారు. కేంద్రం గ్యాస్ ధరలను తగ్గించే వరకు జిల్లా ప్రజలు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఈశ్వర్, సీఐటీయూ కార్యదర్శి వీరేశ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్, వినోద్‌కుమార్, శ్రీనివాసులు, భీమన్న, నాగరాజు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత, ఏప్రిల్ 10 : కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరను పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ నాయకులు రాజు, మండల కార్యదర్శి రాజన్న ఆరోపించారు. గురువారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని ఖాళీ సిలిండర్‌తో పాత బస్టాండ్ ఆవరణ లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం పేదలకు వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి వారిపై మరింత మోయలేని భారం మోపిందన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని లేకపోతే దేశ వ్యాప్తంగా సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుర్మన్న, ప్రేమ రత్నం, సామేల్, భక్తి ఉన్నారు.

మహారాష్ట్ర బంగారు దొంగల పట్టివేత

సమావేశంలో దొంగతనం వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10: వనపర్తి జిల్లాలో బంగారు అపహరించిన మహారాష్ట్ర దొంగల ముఠాలను గురువారం పట్టుకున్నట్లు వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో శివ హనుమాన్ అనే బంగారు దుకాణంలో ఈనెల 3వ తేదీ ఉదయం 11గంటలకు యజమాని దుకాణాన్ని తెరిచారు. మహబూబ్‌నగర్‌లో పని ఉందని తన గుమాస్తాకు రవి, మహేందర్‌ను చూసుకోమని బాధ్యతలు అప్పగించి వెళ్లాడు. కొత్త కోట పట్టణానికి మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన కుటుంబ సభ్యులు ఆర్‌కే లాడ్జిలో ఉంటూ బంగారు కొనేందుకని శివ హనుమాన్ బంగారు దుకాణానికి వచ్చారు. గుమాస్తాకు వారి మాటలతో ముగ్గులో దింపి గుమాస్తాకు మహిళలు అడ్డుగా చేరి తమ పిల్లలు మైనర్లచేత క్యాష్ కౌంటర్‌లో ఉన్న 60.59 గ్రాముల బంగారు బిస్కెట్‌ను దొంగిలించారు. ఔరంగాబాద్ నుంచి తెలంగాణ జిల్లాలో దొంగతనాలు చేయాలనే లక్ష్యంతోనే పథకం ప్రకారం దొంగతనాలకు పాల్పడ్డారని డీఎస్పీ చెప్పారు. వారు వేసుకున్న పథకం ప్రకారం షాపు సమీపంలోనే కర్నూల్ వైపు స్విఫ్ట్ డిజైర్ కారులో మహిళలు భర్తలు వేచి ఉండగా మైనర్లు దొంగిలించిన బంగారును తీసుకొని కారులోకి వెళ్లారు. వెంటనే మహిళలు కారుల్లో చేరుకొని కర్నూల్ వైపునకు పారిపోయారు. గుమాస్తాలు రవి, మహేందర్ క్యాష్ కౌంటర్‌లో బంగారు చూడగా లేకపోవడంతో యజమాని శివ హనుమాన్‌కు సమాచారం ఇవ్వగా వెంటనే వచ్చి షాపులోని సీసీ కెమెరాను పరిశీలించగా మైనర్లు దొంగతనాలకు పాల్పడినట్లు కనపడడంతో యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్పీ ఆదేశాల మేరకు రెండు బృందాలు మహారాష్ట్రకు వెళ్లి నేరస్తులను పట్టుకుని వారి వివరాలు అడుగగా నేరం అంగీకరించారని చెప్పారు. మొత్తం ఏడుగురు వ్యక్తులలో ఇద్దరు మగవారు, ఐదుగురు ఆడవారని , మరో ఇద్దరు మైనర్లు ఉన్నారని చెప్పారు. ఔరంగాబాద్‌కు చెందిన నంది కిశోర్‌పవార్ ఏ1, రోహిత్ మచ్చిందర్ సుకాలే , ఆకాశ్ అన్‌ఖుశ్, సోనాలి, నిర్మలాబాయి, ఇద్దరు మైనర్లు ఉన్నారని చెప్పారు. వీరి నుంచి 6 తులాల బంగారు, ఒక స్విఫ్ట్ కారు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు చేధనలో సీఐ రాంబాబు, ఎస్సై ఆనంద్, సీసీఎస్ ఎస్సై రామరాజు, కానిస్టేబుల్ మురళీ, యుగంధర్ గౌడ్, సత్యనారాయణ, మహిళ కానిస్టేబుల్ ప్రవీణను డీఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

గద్వాల అర్బన్, ఏప్రిల్ 10 : రైలు కిందపడి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలోని అలంపూర్, మానవపాడు మధ్య చోటు చేసుకున్నది. రైల్వే కానిస్టేబుల్ అశోక్‌కుమార్ కథనం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా కేంద్రంలోని అబ్బాస్ నగర్‌కు చెందిన కుమ్మరి నర్సింహ(20) బీఎస్సీ కంప్యూటర్‌లో సెకండియర్ చదువుతున్నాడు. పరీక్షలో ఫెయిల్ అయ్యానని, అలాగే ఈ మధ్యనే తన తండ్రి మృతిచెందాడని నర్సింహ తట్టుకోలేక బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయిరాత్రి రైలు పట్టాల కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. విషయాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహాన్ని దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఊరూ అభివృద్ధి చెందాలి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 10 : అలంపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఊరూ అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో మేలు జరుగుతున్నదన్నారు. అనంతరం ఉండవల్లి మండలం శేరుపల్లికి చెందిన రేవతికి రూ.9వేల, గద్వాల మండలం బట్లదిన్నె గ్రామానికి చెందిన వాసుగౌడుకు రూ.60వేల చెక్కులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడి తొలగింపు

అయిజ, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్‌వీ అయిజ మండలాధ్యక్షుడు మత్తాలిని పదవి నుంచి తొలగిస్తున్నట్లు బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు అతడిని మండలాధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరల